# ఇట్లా జరిగిపోతే....

ఆరోజు పంతులు మా కయిదు లెక్కలిచ్చాడు. అయిదింటికీ అయిదు మార్కులూ తెచ్చుకున్నాను.... మర్నాడు మళ్ళీ మామూలే.

ఆరోజు మా అమ్మా నాన్నా పోట్లాడుకోలేదు. మా అమ్మ చెప్పిందల్లా మా నాన్న ఒప్పుకున్నాడు. ఆయన చెప్పిందల్లా ఆవిడాఒప్పుకుంది. మాకొంప నెవరో మంత్రించినట్టయింది.... తరవాత మళ్ళీ యథా ప్రకారమే.

జీవితం ఈ విధంగా ఒక చిన్న వెలుగు వెలిగి వెంటనే ఎందుకు కొండారిపోతుందో తెలిసేదికాదు.

ఇదంతా దేవుడిచేసే పరీక్ష అనుకునేవాణ్ణి.....

* * *

ప్రెస్సుకు కొత్తటయిపు తెప్పించాం. అచ్చుగా దాంతోనే కొంతమేటరు కంపోజు చేయించాం. ప్రూఫులు చూస్తుంటే మా ప్రింటింగూ బాగున్నట్టేతోచింది. ఎప్పుడూ మా ప్రింటింగు అట్లాగే ఉండకూడదూ?...ఎప్పుడూ కొత్త టైపే వాడుతుంటే ఎందుకుండదూ ? అయితే మరి, ఈ

కొత్తపెపు పూర్తిగా అరిగితేగాని ఇందులోనుంచి మళ్ళీ కొత్తపెపుకు డబ్బురాదామె !

విషమసమస్యగా కనిపించింది....

* * *

వాళ్ళ అల్లుడు ఆరునెల్లకోసారి పెళ్లాన్ని అత్తవారింట దిగవిడిచి తనకు అయిదొందలిస్తేగాని మళ్ళీ తీసుకుపోడు. వాళ్ళట్లాగే ఇస్తున్నారు ... కాని ఎంతకాలమిస్తారు ?

* * *

బాగా కలవాడు. అన్నదమ్ములులేరు. ఒకడే కొడుకు ఒకటే కూతురు. హాయిగా కాలుమీద కాలేసుకుని పరిస్థితి మూడుతరాలు వెళ్ళిపోతై. నందోరాజా భవిష్యతి...ఆయన కొడుకు నాతోపాటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈవుద్యోగం పోతే వీధిలో నిలబడవలిసిందే !....ఏమిటీ కర్మ ?

* * *

"ఇటువంటి ఒడుదుడుకులు లేకుండా ఉండగలందు లకే మన పూర్వీకులు వర్ణవ్యవస్థ తెచ్చిపెట్టారు. అందరికీ పనులు చూపించారు. తురకలూ, పాశ్చాత్యులూ రావ టంతో అంతా పాడయిపోయింది. వాళ్ళని బయటికి పంపించు, అంతా చక్కబడుతుంది" అన్నాడొక హిందూ మహాసభ మనిషి.

నమ్మకం చిక్కలేదు.

* * *

డైకాస్టింగు యంత్రంముందు నిలబడ్డాను. పూర్తిగా అరగంటసేపూ ఏడిపించినమీదట యంత్రం సరిగా పని

చెయ్యటం ప్రారంభించింది. అచ్చులు నున్నగా, నిగనిగ లాడుతూ, సొట్టలూ, మట్టలూ లేకుండా రాసాగినై.

"ఆహా, ఈ విధంగా యంత్రం రోజల్లా పని చెయ్య గూడదూ?" అన్నాడు. పనిచేసే కుర్రాడు అచ్చుల్ని ప్రేమతో చూసుకుంటూ.

నాకా ప్రశ్నకు సమాధానం తెలిసింది!

"అసంభవం" అన్నాను.

"ఏం?" అన్నాడు.

"బాగా రాకుండాపోవటానికి కారణం ఇప్పుడు మంచి అచ్చులు రావటంలోనే ఉంది" అన్నాను.

వాడు నామాట నమ్మలేకపోయినాడు.

"చూడు. బాగా వస్తున్నంతసేపూ అచ్చులు గబ గబా లాగేస్తావు. లాగిన కొద్దీ నీ తొట్టిలోవున్న లోహం తగ్గిపోతుంది. అందుకని కొత్త లోహపుదిమ్మెలు వేస్తావు. తొట్టి చల్లబడుతుంది. నీ అచ్చులు సరిగారావు. అదీగాక నీ డై క్రమంగా వేడెక్కుతుంది. దాన్ని తగినంత చల్లబడేస్తే గాని అచ్చులు సరిగా రావు."

"తొట్టి ఎంత వేడిగా ఉండాలో, డై ఎంత చల్లగా ఉండాలో తెలిస్తే అచ్చులు బాగా వస్తాయేమో?" అన్నాడు మావాడు.

"అంతేకాదు. తొట్టి ఏ వేగాన కాళీ అవుతుందో, డై ఏ వేగాన వేడెక్కుతుందో తెలిసి, దానికి ఎప్పటికప్పుడు అవసరమైన చికిత్స చెయ్యగలిగితే తియ్యకుండా మంచి అచ్చులు వస్తా"యని చెప్పాను.

సంఘంలోమటుకు ఇంతేకాదా ? ఒక వ్యక్తిగాని, వ్యక్తుల సముదాయంగాని శాశ్వతంగాసుఖంగా ఉండటానికి సులువుపద్ధతు లెక్కడున్నై?

ధనికుల సంతతి ధనికులుగానే వుండగలందులకు వారసత్వం పెట్టారు. ఏమవుతున్నది ? లక్షాధికారికి కాల క్రమాన లక్షమంది వారసులవుతున్నారు. దీన్ని కూడా తప్పించుకుందామని రాజరికాలకి ఒకడే వారసుణ్ణి పెట్టారు. ఈ సులువు మార్గం పనిచేసితీరాలి ! పనిచేసిందా ? ఆ సులువు మార్గం మూలంగానే రాజరికం సంఘానికి అనర్థంగా తయారయింది- వాళ్ళ అల్లుడు వాళ్లమ్మాయికి ఆనందం ఇవ్వటానికి అనర్హుడయినట్లుగానే.

మార్పుయొక్క తత్వాన్ని అర్థంచేసుకోకుండా, దానికి అనుగుణమైన మనుష్యప్రయత్నం చెయ్యకుండా, ఏదో ఓమంచి జాగా చూసుకుని, "అమ్మయ్య !" అని చతికిలబడి ఆమీదట శాశ్వతమైన ఆనందం పొందుదామని మానవుడు చేసే ప్రయత్నాలు ఫలించటానికి వీల్లేదు. పరిణామస్వరూపుడైన భగవంతుడామోదించడు. అటువంటి ప్రయత్నాలు చేసే వాళ్లమీదికి సంఘాన్ని లేవదీస్తాడు.

—o—